క్లుప్తంగా

5న వేలం పాటలు

ఉదయగిరి రూరల్: గండిపాళెంలోని ఏపీ గురుకుల పాఠశాలలోని శిథిల భవనాల తొలగింపునకు వచ్చే నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జే పుష్పరాజ్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.10 వేలు ధరావత్తుతో పాటు రూ.3,540 ప్రవేశ రుసుమును డీడీ రూపంలో జూన్ 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా పాఠశాలలో అందజేయాలని కోరారు. వివరాలకు 87126 25047 నంబరును సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంగం: స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. వివరాలు... నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న కారును టైర్‌పంక్చర్ కావడంతో స్కూటీ అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఇన్‌చార్జి ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దౌర్జన్యానికి పాల్పడిన యువకుల అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: పట్టణంలో కుల్ఫీలు విక్రయించే ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువకుడిపై గంజాయిమత్తులో ముగ్గురు యువకులు దౌర్జన్యానికి పాల్పడడమే కాకుండా నగదు తీసుకుని వెళ్లిన విషయం తెలిసిందే. సదరు యూపీ యువకుడు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయాడు. ఈ విషయమై 'సాక్షి'లో 'యూపీ యువకుడిపై దౌర్జన్యం' శీర్షికన కథనం రావడంతో ఎస్సై ఎస్‌కే జిలానీ స్పందించారు. బుధవారం గంజాయిమత్తులో దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలో చెరువు కట్ట సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి నగదు, మైక్‌సెట్‌ను అపహరించారు. బుధవారం ఉదయం ఆలయ నిర్వాహకులు గుర్తించి అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరం గ్రామానికి చెందిన బోగిరెడ్డి శ్రీనివాసులురెడ్డి (47) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గత కొంతకాలంలో కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేయించుకుంటున్న ఆయన పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. స్థానిక సర్పంచ్ బోగిరెడ్డి మల్లేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రారంభానికి ముస్తాబైన రామాలయం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నూతనంగా చేపడుతున్న కోదండరామ స్వామి ఆలయ నిర్మాణం పూర్తయింది. మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించినట్లు కాలనీవాసులు తెలిపారు. త్వరలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు నిర్వహించనున్నట్లుగా వారు పేర్కొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన రామాలయం

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, కలశస్థాపన, శుక్రవారం నూతన విగ్రహాలకు క్షీర, పంచామృతాభిషేకాలు, ధాన్యాదివాసం, నవగ్రహ కలశస్థాపన, విశేష హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చివరిరోజైన శనివారం దాతున్యాసం, యంత్ర స్థాపన, కలశ ఆలయ ప్రవేశం, ప్రాణప్రతిష్ట దర్పణ మహాకుంభాభిషేకం, సీతారాముల కల్యాణోత్సవం, గ్రామోత్సవం, వినాయక స్వామి, సరస్వతీదేవి, ధ్వజస్తంభం, విమాన శిఖర ప్రతిష్ట నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అటకెక్కిన సంక్షేమం.. నిలిచిన సేవలు

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- అనారోగ్యం పాలైన విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు
- కూటమి పాలనలో కుదేలవుతున్న ప్రజలు



సంగం మండలం అన్నారెడ్డిపాళెం సచివాలయంలో విధుల్లో నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్న దృశ్యం

ఉదయగిరి/ఆత్మకూరు: గతంలో 1994 నుంచి 2004 వరకు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు జనం పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అప్పటి జనరేషన్‌కు ఆనాటి పాలన ఒక చేదు అనుభం. ఆ పాలనలో పల్లె పడుతున్న ఇబ్బందులను గోరంట్ల వెంకన్న ఓ గేయ రూపంలో వర్ణించారు.ఆ పాలనకు చెక్ పెడుతూ 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారం చేపట్టారు. ఆ పాలన స్వర్ణయగంగా నేటికి ప్రజల మదిలో పదిలంగా ఉంది. మహానేత ఆకాల మరణం ఉమ్మడి రాష్ట్ర విభజనకు దారితీసింది.రాష్ట్ర విభజన నేపథ్యంలో కొత్త రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అనుభవం అవసరం అని భావించి ప్రజలు 2014లో మళ్లీ పట్టం కట్టారు. 2019 వరకు సాగిన పాలనలో విధ్వంసం చూశారు. అన్ని వర్గాల ప్రజలు బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా పల్లెలు కన్నీరు పెట్టాయి. ఆ కష్టాల కడగండ్లకు చెక్ పెడుతూ 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలస్థాయిలో ఉన్న పాలనను పల్లెకు తీసుకొచ్చారు. గ్రామ స్వరాజ్యానికి అద్దం పడుతూ గ్రామస్థాయిలోనే అన్నీ సేవలు అందించేలా గ్రామసచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. రైతుల కన్నీరు తుడిచేలా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పల్లెలోనే ఆరోగ్య సేవలు అందేలా విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను అందించారు. కానీ ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి పాలనలో పై వ్యవస్థలన్నీ నిర్వీర్యంగా మారాయి. సచివాలయ వ్యవస్థ రూపం కోల్పోయింది.రైతు భరోసా కేంద్రాలు మూత పడ్డాయి. పాత రోజులు జ్ఞప్తికి తెస్తూ ఏ చిన్న పని కావాలన్నా మళ్లీ మండల కార్యాలయాల చుట్టు తిరిగే పరిస్థితి వచ్చింది. ప్రజలు అష్టకష్టాలు పడుతూ కుమిలిపోతున్నారు. కూటమి ఏడాది పాలనపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కిష్టా సుబ్బరాయుడు. సీతారామపురం మండల కేంద్రం. ఆయనకు గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందేవి. పిల్లలకు వసతి దీవెన నగదు వచ్చేది. ఆయన భార్యకు పొదుపు సంఘం తరపున బ్యాంకులో తీసుకున్న అప్పుకు వడ్డీ రాయితీ వచ్చేది.45 ఏళ్లు నిండిన ఆమెకు ఏడాదికి రూ.18500 నగదు వచ్చేది.కానీ ఈ ప్రభుత్వంలో ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. కనీసం గ్యాస్ సిలిండర్ నగదు కూడా రాలేదు. బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ అని హామీ ఇచ్చినా ఇంతవరకు రాలేదు. సూపర్‌సిక్స్ పేరుతో బాబు సున్నం పెట్టారని వాపోతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు నీలం జయమ్మ. వింజమూరు బీసీ కాలనీ. ఏడాదిన్నర క్రితం భర్త కిడ్నీ వ్యాధితో చనిపోయారు.గత ప్రభుత్వంలో ఆమె భర్తకు నెలకు రూ.10వేలు పింఛన్ వచ్చేది. భర్త చనిపోయిన తరువాత వితంతు పింఛన్ రాలేదు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా లాభం లేదు. ప్రభుత్వం ఇస్తే మేమే చెబుతాం అంటూ అధికారులు తిప్పి పంపుతున్నారు.

సేవలు నిలిచిపోయాయి



గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ పాలనలో గ్రామ సచివాలయాల్లో 80 శాతం సేవలు నిలిచిపోయాయి. వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామ సచివాలయాల్లో అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా మందులు పంపిణీ చేసేవారు. మండల కేంద్రాలకు వెళ్లకుండానే సచివాలయాల్లోనే అన్ని సేవలు అందేవి. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులకు ఏ విధులు కేటాయిస్తున్నారో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. సంక్షేమ పథకాల అమలు లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు, ప్రజలకు మధ్య సంబంధాలు తగ్గుతున్నాయి.

– కూనిపోగు ఇర్మీయా, తెల్లపాడు, కలిగిరి మండలం

సర్పంచ్ మాటకే విలువలేదు



గతంలో సచివాలయాల ద్వారా పనులు జరుగుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేది. ప్రస్తుతం సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండక పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సైతం మాట వినడం లేదు. ఒక్క అభివృద్ధి పనికి తీర్మానం చేద్దామన్నా చేయడం లేదు. ప్రజలకు ఎలా సమాధానం చెప్పాలో తెలియడంలేదు. గతంలో సచివాలయం సిబ్బంది చక్కగా పనిచేసేవారు. కూటమి ప్రభుత్వంలో వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది.

– భీమతాటి శేషమ్మ, సర్పంచ్, అన్నారెడ్డిపాళెం, సంగం మండలం

అరకొరగా సేవలు

గత ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు నియోజకవర్గంలో 93, ఉదయగిరి నియోజకవర్గంలో 91 గ్రామసచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటికి అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్లతో పాటు 11 శాఖల ఉద్యోగుల సాయంతో 534 రకాల సేవలను అందించారు. దాదాపు 36 పథకాలను అందజేశారు. ఇప్పుడు కూటమి పాలనలో సేవలు, సంక్షేమ ఫలాలు నిర్వీర్యమయ్యాయి. ఏడాది పాలన పూర్తవుతున్నా సంక్షేమ పథకాల అమలు ఊసేలేదు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తానని అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబు ప్రస్తుతం ఇచ్చిన హామీలను అమలు చేయలేక సచివాలయ వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా కుట్రలు పన్నుతున్నారు. గతంలో వలంటీర్లు తాము సేకరించిన సమాచారాన్ని నమోదు చేయించేందుకు వస్తూ.. వెళ్తూ ఉండడంతో సచివాలయ భవనాలు కళకళలాడుతుండేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లేవు. అన్ని రకాల సేవలు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు వెళ్లడం తగ్గించేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడడంతో కొందరు సిబ్బంది సైతం సమయపాలన పాటించడం లేదు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నిస్తే వివిధ రకాల సర్వేలతో సతమతమవుతున్నామని, అందుకోసమే కార్యాలయాలకు రావడం లేదని చెబుతూ తప్పించుకుంటున్నారు. దీంతో గత ఐదేళ్లుగా సచివాలయ వ్యవస్థకు అలవాటుపడిన ప్రజలు చిన్నచిన్న పనులకు కూడా సచివాలయాల చుట్టూ రోజూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

అందని వైద్యసేవలు

గత ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ప్రాథమిక వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. నేడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సచివాలయాల పక్కనే నిర్వహిస్తున్నా పూర్తి స్థాయిలో మందులు, పరీక్షలు అందుబాటులో లేవు. గత ప్రభుత్వంలో 105 రకాల మందులు పేదల కోసం అందుబాటులో ఉంచగా, ఇప్పుడు 70 రకాల మందులను ఇవ్వడమే గగనంగా మారింది. నాడు 15 రకాల పరీక్షలు విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఉండగా ఇప్పుడు 5 రకాల పరీక్షలను మాత్రమే చేస్తున్నారు. గ్రామీణ వైద్యం దాదాపు అటకెక్కే పరిస్థితి దాపురించింది.

పేదల ఆశాజ్యోతి విజయకుమార్



మర్రిపాడులో..



ఉదయగిరిలో విజయకుమార్‌కు నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు



ఉదయగిరి: వింజమూరులో..

మర్రిపాడు: జనవిజ్ఞానవేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ విజయకుమార్ పేద ప్రజల ఆశాజ్యోతి అని ఆ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కంటి పోలయ్య అన్నారు. మర్రిపాడు సెంటర్‌లో డాక్టర్ విజయకుమార్ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయకుమార్ పేద ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. జిల్లాలో సారా వ్యతిరేక, అక్షరాస్యత ఉద్యమాలకు నాంది పలికారన్నారు. తొలుత విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోపినాథ్, మండలాధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి రసూల్ బాబు, ఉపాధ్యక్షుడు కే వేణుగోపాల్, కే శ్రీనివాసులు, గంగవరపు శ్రీనివాసులునాయుడు, బత్తల రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని వేణు నర్సింగ్ హోమ్‌లో జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ విజయకుమార్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విజయకుమార్ చిత్రపటానికి జేవీవీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విజయకుమార్ నెల్లూరు వైద్యశాలను స్థాపించి ఎంతో మంది పేదలకు వైద్యం అందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, మున్నా, మహ్మద్‌అలీ, సురేష్‌కుమార్, ఖాదర్‌బాషా, రామిరెడ్డి, రంతుజానీ, ఓబుల్‌రెడ్డి, గౌస్‌బాషా, బీ శ్రీనివాసులు, జాఫర్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: జేవీవీ వరికుంటపాడు మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ విజయకుమార్‌రెడ్డి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పామూరు పట్టణంలో విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేవీవీ నాయకులు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక, నెల్లూరు ఆస్పత్రి ద్వారా పేద ప్రజలకు ఎన్నో సేవలు అందించి వారి హృదయాల్లో నిలిచిపోయారన్నారు. జేవీవీ జిల్లా ట్రెజరర్ పీఎం చలం, మండల ప్రధాన కార్యదర్శి డీవీ రమణయ్య సభ్యులు గొల్ల రమణయ్య, టీ కొండారెడ్డి, కృష్ణప్రసాద్, రాజు, రసూల్ పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 280 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 532 బేళ్లను తీసుకురాగా 437 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 95 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.240.67 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయి.

డీసీపల్లిలో 520 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 520 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 664 బేళ్లు రాగా 520 బేళ్లను కొనుగోలు చేశామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.234.30 ధర లభించిందని వివరించారు. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఆత్మకూరు/ఉదయగిరి/సంగం/కలిగిరి: ప్రముఖ నటుడు, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరులోని సత్రం సెంటర్, బస్టాండ్ సెంటర్, బీఎస్సార్ సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సంగం, కలిగిరి, వింజమూరులోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఉదయగిరిలో మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ కృష్ణారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. తహసీల్దార్లు సోమ్లానాయక్, హమీద్, చొప్పా రవీంద్రబాబు, ఎంపీడీఓలు షాలెట్, శ్రీనివాసరెడ్డి, ప్రత్యూషారెడ్డి, ఎస్సై ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలో కొరియర్, ఆన్‌లైన్ డెలివరీ సంస్థల్లో పనిచేసే చిరుద్యోగులు 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని బీడీ కార్మికుల సంక్షేమ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎస్ అర్జున్‌రావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హరిబాబు తెలిపారు. బుధవారం వారు పట్టణంలోని బీడీ కార్మికుల ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఈకామ్ ఎక్స్‌ప్రెస్ డెలివరీ, తదితర సంస్థల్లో పనిచేసేవారు తప్పనిసరిగా పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ- శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న చిరుద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఆధార్, పాన్‌కార్డు, మొబైల్ నంబరుతో నెట్ సెంటర్, మీసేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబరు 14434ను సంప్రదించాలని సూచించారు.

సినిమాహాళ్లలో తనిఖీలు

కావలి(జలదంకి): కావలి పట్టణంలోని సినిమా హాళ్లలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి బుధవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని మానస, వెంకటేశ్వర, స్రవంతి థియేటర్లను సందర్శించి అనుమతులు, సీటింగ్ కెపాసిటీ, పార్కింగ్ సౌకర్యం, క్యాంటీన్లలో అమ్మకాలు, బిల్లింగ్, మరుగుదొడ్లు, తదితరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సినిమాహాళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. అధిక ధరలకు టికెట్లు, క్యాంటీన్లలో తినుబండారాలు, మంచినీరు తదితరాలను ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని శిరీషా సూర్య థియేటర్‌ను తహసీల్దార్ ఎస్కే హమీద్ బుధవారం తనిఖీ చేశారు. థియేటర్‌లోని వసతులను పరిశీలించారు. వసతులు అన్ని సక్రమంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ ఇమ్రాన్‌ఖాన్, వీఆర్వో బీ మురళి ఉన్నారు.



వింజమూరులోని థియేటర్‌ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్

పదోతరగతి విద్యార్థినికి అభినందన

ఆత్మకూరు: చేజర్ల మండలానికి చెందిన ఉడతా అనూషా పదోతరగతిలో 594 మార్కులు సాధించడంతో ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం అభినందించారు. నెల్లూరులోని తన నివాసంలో అనూషాతో పాటు తండ్రి ఉడతా చిన్నరత్తయ్యను అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, చేజర్ల మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పీ రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాకివాయి నాగిరెడ్డి పాల్గొన్నారు.



లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని నిరసన

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ముస్తాపురం, నరసాపురం ప్రాంతాలకు చెందిన ప్రజలు విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆత్మకూరు ఈఈ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా కిలోవాట్‌కు వేయి రూపాయలు చొప్పున కడితే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఆ మేరకు తాము చెల్లించామని చెప్పారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని, ఇళ్లలో ట్యూబ్‌లైట్లు వెలగడం లేదన్నారు. బోర్ల మోటార్లు పనిచేయడం లేదని వాపోయారు. విద్యుత్ అధికారులను అడిగితే విద్యుత్ పరికరాలు అందుబాటులో లేవని చెబుతున్నారని, ప్రైవేట్ లేఅవుట్లలో ప్రజలు నివాసం లేకున్నా ఆయా ప్రాంతాల్లో లక్షలాది రూపాయల విలువ కలిగిన విద్యుత్ పరికరాలను ఎలా ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. పది రోజుల్లోగా సమస్యను పరిష్కరించకపోతే డీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానికులకు మద్దతుగా పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఈఈ ఆఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సంగంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

సంగం: నిత్యం యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఎంపీడీఓ షాలెట్ పేర్కొన్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంగం మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై అధికారులు, సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని, ఆరోగ్యంగా జీవించేందుకు యోగా ఎంతో ఉపయోగకరమన్నారు. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉదయగిరి: యోగాతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని ఎంపీడీఓ అప్పాజీ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో యోగాపై సర్పంచ్‌లు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఏటా జూన్ 21న యోగా దినోత్సవాన్ని జరుపుతూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 10న ఉదయగిరిలో జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు, వైద్యాధికారిణి శివకల్పన, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: మండల పరిషత్ కార్యాలయం, లక్ష్మీపురంలోని గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులకు యోగాపై శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా పాటించాలన్నారు. యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎస్సై ఉమాశంకర్ పాల్గొన్నారు.



వింజమూరులో..

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగా మాస్టర్ ఎస్ మాల్యాద్రిరెడ్డి ఆధ్వర్యంలో యోగాపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీ రాజేంద్ర ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగూర్‌వలి, పీఈటీలు, సీనియర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు

- కంటైనర్ కిందకు దూసుకెళ్లిన వాహనం
- భర్త మృతి, భార్యకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మితిమీరిన వేగంతో ఆటోను వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆటో రోడ్డుక్రాస్ చేస్తున్న కంటైనర్ కిందకు దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న భర్త మృతి చెందగా, భార్యకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి కేవీఆర్ పెట్రోల్‌బంకు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు...ప్రగతినగర్ మూడోవీధికి చెందిన హబీబ్(45), ఆలియాలు దంపతులు. హబీబ్ జిల్లా కోర్టు ఎదురుగా బిర్యాని పాయింట్ నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి హబీబ్, ఆలియాలు దుకాణం మూసుకుని వస్తువుల అన్నింటిని తమ ఆటోలోవేసుకుని ఇంటికి బయలుదేరారు. కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి నాగాలాండ్‌కు చెందిన ఓ భారీ కంటైనర్ మాగుంటలేఅవుట్ వైపు రోడ్డుక్రాస్ చేస్తుండగా ఆటోను ఆపారు. ఇంతలో ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న శ్రీనివాస ప్రైవేట్ ట్రావెల్స్‌బస్సు ఆటోను వేగంగా ఢీకొంది. దీంతో ఆటో కంటైనర్ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జు అయింది. ఆటో నడుపుతున్న హబీబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఆలియా కిందకు దూకేయడంతో స్వల్పగాయాలతో బయటపడింది. నగర డీఎస్పీ పీ సింధుప్రియ, దర్గామిట్ట, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకని సహాయక చర్యలు ప్రారంభించారు. స్థానికుల సాయంతో ఆటో నుంచి మృతదేహాన్ని వెలికితీసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు.ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కంటైనర్ కిందకు దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జైన ఆటో